## క్లుప్తంగా

### అపార్ట్‌మెంట్‌లో బంగారు ఆభరణాలు చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జన సంచారం ఉన్న సమయంలోనే గొల్లపూడి వన్‌సెంటర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. ఫ్లాట్ తాళం పగుల గొట్టి 205 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఎర్రమాని వెంకట సుబ్రహ్మణ్య బంగారు వాసవి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పని చేస్తున్నారు. రోజు ఉదయం 10 గంటలకు ఆఫీసుకు వెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటికి వస్తారు. శుక్రవారం ఆఫీసుకు వెళ్లిన సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌లోనే ఉంటున్న రామలక్ష్మి అనే మహిళ బంగారు వాసవికి ఫోన్ చేసి ఇంటి తాళం పగులగొట్టి ఉందని సమాచారం ఇచ్చింది. ఆమె ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీనిపై భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బీరువాలో పెట్టిన 85 గ్రాముల హారం సహా 205 గ్రాముల పలు బంగారు ఆభరణాలు కనిపించలేదన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### విద్యార్థులు లక్ష్యాన్ని సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు చక్కని లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానిని సాధించేందుకు కృషి చేయాలని ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కార్యదర్శి గుండా గంగాధర్ అన్నారు. ఆ కళాశాల ఆధ్వర్యంలో 2023 పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ భవిష్యత్తు కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే విజయం తప్పకుండా సాధిస్తామన్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఏ కారణం వల్ల ఉత్తీర్ణులు కాలేకపోయినప్పటికీ, ఏడాది సమయాన్ని విద్యార్థులు కోల్పోకుండా ఉండేందుకు ఈ తరగతులు ఉపయోగిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ కనకదుర్గ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా తమ కళాశాల పక్షాన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే పబ్లిక్ పరీక్షల వరకు ఈ తరగతులు జరుగుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్, నోటు పుస్తకాలకు పంపిణీ చేశారు. అధ్యాపకులు సునీత, పి.స్వరూప పాల్గొన్నారు.

### ముంపు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలి

**సౌత్ డివిజన్ ఏసీపీ రవికిరణ్**

కృష్ణలంక(విజయవాడతూర్పు):కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముంపు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సౌత్ డివిజన్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూచించారు. శుక్రవారం ఆయన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ముంపునకు గురైన పద్మావతి ఘాట్, రణదీవెనగర్ ప్రాంతాలను ఆయన సీఐ ఎం.వి.దుర్గారావుతో కలిసి పర్యటించారు. నదిలో మునిగిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేసే కార్మికుల రేకుల షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీ ఎగువన పడుతున్న వర్షాల వలన కృష్ణానదికి వరద ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున ముంపు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉంటూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ఎవ్వరూ కూడా నదిలోకి ప్రవేశించరాదన్నారు.

### 7 నుంచి మిషన్ ఎంబ్రాయిడరీలో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు):గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆగస్టు 7వ తేదీ నుంచి మిషన్ ఎంబ్రాయిడరీలో శిక్షణ ప్రారంభిస్తున్నామని విజ్ఞాన కేంద్రం మహిళా శిక్షణా విభాగం ఇన్‌చార్జి పి.విజయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు టైలరింగ్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్‌లలో శిక్షణ ఇచ్చామని చెప్పారు. ఇప్పుడు కొత్తగా మిషన్ ఎంబ్రాయిడరీలో శిక్షణ ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు మూడు నెలల పాటు ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు ఆగస్టు 5వ తేదీలోగా విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 0866 2578044, 9490098021 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### రక్షణ గోడ నిర్మాణ పనులకు ఆటంకం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానది పరివాహక ప్రాంతంలో వరద ముంపు శాశ్వత నివారణకు నిర్మిస్తున్న రక్షణ గోడ ఫేజ్-3 పనులకు ఆటంకం కలిగింది. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి ఎగువన వరద నీరు భారీగా చేరడంతో అన్ని గేట్లను ఎత్తి దిగువకు 2.5 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని జలవనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. దీంతో రక్షణ గోడ నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది. వరదను ముందుగా అంచనా వేయకపోవడంతో రక్షణ గోడ నిర్మిస్తున్న పీఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి చెందిన రెండు లారీలు, స్టీల్, షట్టరింగ్ సామగ్రి నీట మునిగాయి. దాదాపు రూ.120 కోట్లతో నిర్మిస్తున్న ఈ రక్షణ గోడ నిర్మాణ పనులు 60 శాతం పూర్తయ్యాయి. వరదలు తగ్గిన వెంటనే మరలా నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

# పర్యావరణ సమస్యల పరిష్కారానికి కృషి

**ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు**

భవానీపురం(విజయవాడపశ్చిమ):వాయు కాలుష్యం, కార్బన్ ఉద్గారాలు, అత్యధిక ఉష్ణోగ్రతల ప్రభావం వంటి పర్యావరణ సమస్యలను పరిష్కరించడమే ఎవెన్యూ ప్లాంటేషన్ ప్రాజెక్ట్ లక్ష్యమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు నగరపాలక సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యాధరపురం గుప్తా సెంటర్‌లోని షాదీఖానా ఆవరణలో ఎమ్మెల్యే వెలంపల్లి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఎవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమం కింద ప్రధాన రహదారులు, మార్గాల వెంట, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ అనుకూల వాతావరణాన్ని కల్పించిన వారమవుతామని తెలిపారు. నగర పౌరులకు స్థిరమైన పచ్చదనాన్ని అందించడం ద్వారా భవిష్యత్ తరాలకు మేలు చేయడం మనందరి బాధ్యత అన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్ నగరాన్ని అందంగా తీర్చిదిద్దటమే కాకుండా వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడంలో కూడా దోహదపడుతుందని చెప్పారు. అలాగే సహజ గాలిని శుద్ధి చేయడం, హానికరమైన కాలుష్య కారకాలను శోషించి ఆక్సిజన్ విడుదల చేస్తుందన్నారు. తద్వారా గాలి నాణ్యతను మెరుగు పరుస్తుందని పేర్కొన్నారు. దీంతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టిస్తుందని తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విజయవాడ నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలితో కూడిన వాతావరణాన్ని అందించడమే ఎవెన్యూ ప్లాంటేషన్ ప్రాజెక్ట్ ఉద్దేశమన్నారు. నగర పాలక చేస్తున్న ఈ ప్రయత్నాలను పౌరులు ఉత్సాహంగా స్వాగతించడం అభినందనీయమని తెలిపారు. నగర ప్రజలు కొత్త పచ్చని ప్రదేశాలను పెంపొందించడంతో పాటు రక్షించేందుకు కృషి చేయాలని కోరారు. గ్రీన్ ఆంధ్రప్రదేశ్ - గ్రీన్ విజయవాడ కోసం వివిధ కార్యక్రమాల ద్వారా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ చేసే ప్రయత్నాలను ఇతర నగరాలు అనుసరించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఏడీహెచ్ శ్రీనివాసులు, పార్కుల సూపర్‌వైజర్ గ్రరై రమణ, శానిటరీ సూపర్‌వైజర్



షాదీఖానా ఆవరణలో మొక్కనాటి గుంతలో మట్టి పోస్తున్న వెలంపల్లి




పాఠశాలలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శివరామకృష్ణప్రసాద్, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు కొత్తమాసు వెంకట పిచ్చయ్య, బీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ఏటా జరుపుకునే వరల్డ్ నేచర్ కన్జర్వేషన్ డే సందర్భంగా శుక్రవారం భవానీపురం చైతన్య పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో హరిత భారత్ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో మొక్కలు నాటించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సత్య చిత్ర మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని సూచించారు. మొక్కల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఏజీఎం మురళీకృష్ణ, రామారావు, కో ఆర్డినేటర్ చక్రధర్, డీన్ రంగారావు, నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పీఎన్‌బీలో అన్ని రకాల రుణాలు



పీఎన్‌బీ అందించే రుణాల వివరాల పత్రాలను అందిస్తున్న శరత్‌కుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రజలకు అవసరమైన అన్ని రకాల రుణాలను వారి అర్హతలను బట్టి అందిస్తుందని ఆ బ్యాంక్ ఎంజీరోడ్డు విజయవాడ శాఖ చీఫ్ మేనేజర్ ఎ.శరత్‌కుమార్ అన్నారు. ఆ బ్యాంక్ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌లో శుక్రవారం బ్యాంక్ అందించే వివిధ పథకాల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ భారతదేశంలో రెండో అతి పెద్ద బ్యాంక్‌గా ఉందన్నారు. విస్తృతమైన శాఖలతో దేశవ్యాప్తంగా అత్యంత సమర్థవంతమైన బ్యాంక్‌గా గణతికెక్కిందన్నారు. వినియోగదారులకు అవసరమైన గృహ, వ్యక్తిగత, వాహన రుణాలతో పాటుగా విద్యా తదితర వృత్తి పరమైన రుణాలను అందించటంలోనూ బ్యాంక్ చక్కని వడ్డీ రేట్లను అందిస్తుందన్నారు. అతిథిగా హాజరైన ఏపీ టెక్స్‌టైల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చు వెంకటప్రసాద్ మాట్లాడుతూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ అందించే వివిధ రకాల రుణాలను తమ వ్యాపార వర్గానికి అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## జైన్ సమాజ్ సేవలు అభినందనీయం

**ఎమ్మెల్యే వెలంపల్లి**

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జైన్ సమాజ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. జైన్ సమాజ్ ఆధ్వర్యంలో 37, 53 డివిజన్లకు చెందిన 250 మంది పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్ల పంపిణీ కార్యక్రమాన్ని పాతబస్తీలోని చిట్టూరి కాంప్లెక్స్ వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో విభిన్న మతాలు, కులాలు చక్కని జీవనం చేస్తున్నాయని తెలిపారు. సోదర భావంతో ముందుకు సాగుతున్నాయని చెప్పారు. అదే క్రమంలో జైన్ సమాజం వ్యాపార రంగంలో ముందుకు సాగుతూ తమ చుట్టూ ఉన్న ప్రజలకు అండగా ఉండాలనే లక్ష్యంతో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వర్షాకాలాన్ని పురస్కరించుకొని రెయిన్ కోట్లు ఇవ్వటం సంతోషకరమన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ఏపీ జైన్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి మాట్లాడుతూ జైన్ సమాజం అందిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అదేవిధంగా జైనుల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, మహాదేవు అప్పాజీరావు, జైన్ సమాజ్ ప్రముఖులు పన్నాలాల్‌జైన్, ప్రవీణ్‌జైన్, అశోక్‌జైన్, భోగిలాల్‌జైన్, జయంతిలాల్‌జైన్, అక్షయ్‌జైన్, సురేష్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.



రెయిన్ కోట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కార్పొరేటర్లు

### పంజాలో ప్రత్యేక ప్రార్థనలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని పంజా సెంటర్‌లోని రసూల్ హుస్సేన్ పీర్ పంజా ప్రాంగణంలో పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పంజా నిర్వాహకులు, పార్టీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్యాన్ని కాపాడుకోడానికి హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన ప్రాణత్యాగం చారిత్రాత్మకమన్నారు. నాటి వీరోచితగాథను స్మరించుకుందాం అని తెలిపారు. కార్పొరేటర్లు అర్షద్, ఇర్ఫాన్, నాయకులు హయత్, గౌస్ మొహిద్దీన్, జీఎంసీ బాషా, వాజిద్‌ఖాన్, దాస్‌బాషా, ఖాదర్, సలీమ్, బాషి, నాహిద్, మొహమూద్, సుభాన్‌ఖాన్ తదితరులున్నారు.

## తాగునీటి పైపులైన్‌కు శంకుస్థాపన

వూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ):నియోజకవర్గంలోని పాత ఆర్‌ఆర్‌పేటను మోడల్ డివిజన్‌గా తీర్చి దిద్దుతామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ తెలిపారు. రూ.19 లక్షల అంచనాతో నూతన తాగునీటి పైపులైన్ నిర్మాణానికి వెలంపల్లి శ్రీనివాస్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీన్ని నివారించేందుకు నూతన పైపులైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో కొత్త వాటర్ ట్యాంక్ నుంచి డివిజన్‌కు నీటి సరఫరా అయ్యేదని దీనివల్ల తాగు నీరు సరిగ్గా ప్రజలకు అందేది కాదన్నారు. దీన్ని నివారించేందుకు కేదారేశ్వరపేట వాటర్ ట్యాంక్ నుంచి మంచినీటి పైపులైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల తాగు నీరు సరిపడినంతగా లభిస్తుందన్నారు. డివిజన్ అధ్యక్షుడు రబ్బానీ, వాసా బాబు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల శరత్ బాబు, గొలగాని శ్రీను, సుబ్రమణ్యం, పార్టీ డివిజన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పాత ఆర్‌ఆర్‌పేటలో పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న, ఎమ్మెల్యే వెలంపల్లి

## ప్రమాణాలతో ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్మాణం

**కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ నగరం అంతటా మురుగునీటి శుద్ధి ప్లాంట్లను (ఎస్‌టీపీ) నిర్మించడానికి నిర్దిష్టమైన ప్రమాణాలు పాటిస్తుందని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యునిడో), నగర పాలక సంస్థ అధికారులతో కలిసి సర్కిల్ -3 పరిధిలోని రామలింగేశ్వరనగర్ 15, 16 వ డివిజన్‌లోని 20 యం.ఎల్.డి సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన బంగ్లాలో పబ్లిక్ హెల్త్ విభాగం, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌టీపీల నిర్వహణకు రూ.135 కోట్లు మంజూరు కాగా మురుగునీటి నిర్వహణ క్లిష్టమైన సమస్యను పరిష్కరించడం, స్వచ్ఛమైన ఇంధన పరిష్కారాలను ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్దేశించుకుని పనిచేస్తున్నామని యునిడో ప్రతినిధులకు వివరించారు. ప్రాజెక్ట్ ఫేజ్-1లో నగరవాసులకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించటం, నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు నగరంలోని రామలింగేశ్వరనగర్, అజిత్‌సింగ్‌నగర్, ఆటోనగర్, జక్కంపూడి ప్రాంతాల్లో రూ. 14.9 కోట్లతో నాలుగు ఎస్‌టీపీలు, బయోగ్యాస్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. బయోగ్యాస్ ఎనర్జీ ప్లాంట్లతోపాటు స్వచ్ఛమైన శక్తిని ఉత్పత్తి చేయడానికి సేంద్రీయ వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. దీనివల్ల కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తున్నామని పేర్కొన్నారు. ఫేజ్-2 మురుగునీటి శుద్ధిని మరింత మెరుగుపరచటంకు వీఎంసీ రూ. 120 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామని వెల్లడించారు. కాలుష్య నియంత్రణకై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సూచించిన విధివిధానాలు పటిష్టంగా అమలు చేసే క్రమంలో నగర వ్యాప్తంగా మినీ ఎస్‌టీపీలను ఏర్పాటు చేయనున్నామని స్పష్టం చేశారు. సీనియర్ సాంకేతిక నిపుణులు డాక్టర్ నంద్ పాల్ సింగ్, అర్బన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ స్పెషలిస్ట్, రమణ రావు, నేషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, దీపికా లేలే, వీఎంసీ సీఈ ప్రభాకర్, ఎస్ఈ రామ మోహన్ రావు, ఈఈ వెంకటేశ్వర రెడ్డి, అర్బన్ ఇన్‌ఫ్రా ఇంజనీర్ చిరంజీవి పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

## ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యా సంవత్సరం ఆరంభం నుంచి విద్యార్థులు ఒక ప్రణాళికతో చదివితే తప్పనిసరిగా మంచి ఫలితాలను సాధించవచ్చని జిల్లా యువజన వ్యవహారాల శాఖ సహాయ మేనేజర్ నిమ్మగడ్డ నాగేశ్వరరావు అన్నారు. విద్యాధరపురం మారయ్య హోటల్ సెంటర్‌లోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో 9, 10వ తరగతి విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతను చదువులో ఉపయోగించుకుంటూ సత్ఫలితాలను సాధించాలని సూచించారు. కరోనా అనంతర కాలంలో చాలామంది సెల్ ఫోన్స్, ఇంటర్‌నెట్‌కు బానిసలుగా మారి తమ జీవితాలనే కాకుండా కుటుంబాలనూ నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు స్నేహాలు, దురలవాట్లు, వ్యసనాలకు అలవాటుపడి అసలైన చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఒక లక్ష్యం, ఒక ధ్యేయం నిర్ణయించుకుని ఆ దిశలో ప్రతి క్షణం కృషి చేయాలని తెలిపారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు చాలా మంది ఇంటి దగ్గర హోంవర్క్ అని బుక్‌లో రాస్తుంటారేకానీ బుర్రలోకి ఎక్కించుకోరన్నారు. అలా కాకుండా నేర్చుకున్న పాఠాలు ఎంత వరకు అర్థమయ్యాయో తెలుసుకుని అవసరమైతే సందేహ నివృత్తి చేసుకోవడం ముఖ్యమన్నారు. శిక్షకులు పద్మజ మాట్లాడుతూ మంచి స్నేహాలు, ధృఢ సంకల్పం, నిజాయతీ విజయాలను సాధించి పెడతాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇటువంటి మంచి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియ చేశారు. ఉపాధ్యాయులు ప్రసాద్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

### యువతి అదృశ్యంపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):తమతో పాటు ఇంట్లో నిద్రిస్తున్న తమ కుమార్తె అదృశ్యమైందని సింగ్‌నగర్‌కు చెందిన ఓ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎక్సెల్‌ప్లాంట్ సమీపంలో నివసిస్తున్న షేక్ హుసేన్‌బీ పెద్దకుమార్తె షేక్ సుల్తానా ఇంటర్మీడియెట్ వరకూ చదువుకొని ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటుంది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి, నిద్రపోయిన సుల్తానా తెల్లారి కన్పించకపోవడంతో ఫిర్యాదు చేశారు.

### డెంగీ, మలేరియా జ్వరాల నివారణపై అవగాహన



పటమట(విజయవాడతూర్పు):విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ మలేరియా, డెంగీ జ్వరాలపై పోరాటానికి శుక్రవారం - డ్రై డే నిర్వహించాలని బయాలజిస్ట్ సూర్యా నాయక్ తెలిపారు. ఫ్రైడే-డ్రైడే సందర్భంగా 30 వ డివిజన్ జీ.వి.ఆర్.నగర్‌లో డెంగీ, మలేరియాల జ్వరాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలతో ప్రజారోగ్యాన్ని పరిరక్షించడం, వెక్టార్ ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని అరికట్టడం, నివారణ చర్యలు కోసం ప్రతి శుక్రవారం వీఎంసీ ఫ్రైడే డ్రై డేగా నిర్వహిస్తుందన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో దోమల వృద్ధి ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్మూలించడంలో భాగంగా నగర వాసులు తమ పరిసరాల్లోని నిల్వనీటిని ఉంచకుండా ప్రణాళిక చేసుకోవాలన్నారు.







### చేప చిక్కిందోచ్...

ప్రకాశం బ్యారేజీ వద్ద వరద పోటెత్తడంతో నీటి కొంగలు చేపల వేట మొదలుపెట్టాయి. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహంలో చేపలు పెద్ద ఎత్తున ఉన్నాయి. చేపల కోసం పొంచి ఉన్న కొంగలు అవి రాగనే అమాంతంగా నోట పట్టుకుంటున్న చిత్రాలివి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## బీసీలకు న్యాయం చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీసీలకు న్యాయం చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, జనరల్ స్థానాల్లో సైతం బీసీలకు పట్టం కట్టడం ద్వారా బీసీలపై ఉన్న ప్రేమాభిమానాలు చాటుకున్నారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్ అన్నారు. ముత్యాలంపాడులోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు బీసీల పట్ల ప్రేమ ఒలకబోస్తున్న టీడీపీ అధినాయకత్వం అధికారంలో ఉండగా ఎంతమది బీసీలను రాజ్యసభకు పంపించారని ప్రశ్నించారు. అలాగే బీసీలలో ఎంతమందికి మంత్రి పదవులు ఇచ్చారో గుర్తు తెచ్చుకోవాలన్నారు.

బీసీ సంక్షేమ హాస్టల్లో ఆహార నాణ్యత, మెస్ బిల్లులు, ఉపకార వేతనాలు గతంతో పోల్చుకుంటే ఎంతగా మెరుగ్గా ఉన్నాయో జగమెరిగిన సత్యం అన్నారు. లోకేష్ బీసీల గురించి మాట్లాడే టప్పుడు వారు ఏం చేశారో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు.

## అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం విజయవాడకు చెందిన కుప్పా కృష్ణవేణి, నళిని శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద కళావేదికపై పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందచేశారు.

### రుణాలపై అవగాహన

భవానీపురం:కెనరా బ్యాంక్ సర్కిల్ కార్యాలయంలో కస్టమర్ మీట్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సర్కిల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ రవి వర్మ, హెడ్ ఆఫీస్ జనరల్ మేనేజర్ మనోజ్ కుమార్ దాస్, ఇతర ఎగ్జిక్యూటివ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభింపచేశారు. బ్యాంక్ వ్యవస్థాపకులు సుబ్బారావు చిత్రపటానికి నివాళుల ర్పించారు. రవి వర్మ మాట్లాడారు.

### బ్యారేజీపై సందర్శకుల సందడి





విజయవాడ ప్రకాశం బ్యారేజీపై సందర్శకుల సందడి మొదలైంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. బ్యారేజీ గేట్లు సైతం ఎత్తి నీటిని దిగువకు వదిలారు. దీంతో నీటి ప్రవాహాన్ని తిలకించేందుకు నగరవాసులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తరలివస్తున్నారు. బ్యారేజీపై సెల్ఫీలు దిగుతూ ఆహ్లాదంగా ఉంటున్న చిత్రాలివి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ